క్లుప్తంగా

లింగాకర్షక బుట్టల పంపిణీ



లింగాకర్షక బుట్టలను అందజేస్తున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటకుంటతండాలో వ్యవసాయ విస్తరణాధికారి కరంటోతు శ్రీలత ఆధ్వర్యంలో బుధవారం మొక్కజొన్న, పొద్దుతిరుగుడు విత్తనాలు, లింగాకర్షక బుట్టలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పంటలలో ఉన్న చీడపీడల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన తోర్నాల శాస్త్రవేత్తలు పల్లవి, విజయ్, వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, ఏఈఓ విజయ్, రైతులు గుగులోతు రాజు, నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ నివారణ



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): అవగాహనతోనే క్షయ వ్యాధి నివారించవచ్చని డీటీసీఓ డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. రాజగోపాల్‌పేట పీహెచ్‌సీలో బుధవారం టీబీ చాంపియన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించి నిర్మూలనకు కృషి చేస్తామని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. జ్వరం, రెండు వారాలకు మించి దగ్గు తగ్గకపోతే ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. అవసరమైన పరీక్షలుచేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి సరిత, ప్రోగ్రామింగ్ అధికారి శ్రీనివాస్, సీటీఎస్ రాజు, హెచ్ఈఓ స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏడీఓ

నంగునూరు(సిద్దిపేట): రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఏడీఏ పద్మ పిలుపునిచ్చారు. గట్లమల్యాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏఈ గీతతో కలసి ఆమె సందర్శించి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలుచేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, వడ్లను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తేమ శాతం లేకుండా వడ్లను తెస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని సూచించారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బిట్స్ పిలానీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఇన్ఫినిటీ ఒలింపియాడ్ ఆన్‌లైన్ టెస్ట్‌లో మాడ్యులస్ పాఠశాల విద్యార్థులు రాణించారని, పాఠశాల డైరెక్టర్ నితిన్, ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 550కు పైగా పాఠశాలలు ఈ పోటీలలో పాల్గొనగా తమ పాఠశాల 38వ స్థానాన్ని సాధించిందన్నారు. ఆ విద్యార్థులను బుధవారం అభినందించారు.

రైతుల ఇబ్బందులు



మాట్లాడుతున్న రవీందర్ గౌడ్

హుస్నాబాద్: గడిచిన వానకాలంలో పత్తి పంట వివరాలను ఆన్‌లైన్ చేసుకోని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో 70 శాతం నమోదుచేసి అధికారులు చేతు లు దులుపుకున్నారన్నారని, మిగతా 30 శాతం మంది రైతుల వివరాలు నమోదు చేయకపోవడంతో పత్తిని అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521 ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు కాని రైతులు తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని, నమోదు చేసుకోని రైతులు మద్దతు ధర పొందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అందరి బంధువయ.. బండమీది రామయ్యా

- పత్రియేటా కార్తీక పౌర్ణమికి ఉత్సవాలు
- ముస్తాబైన సీతారాముల ఆలయం
- గురువారం నుంచి వేడుకలు ప్రారంభం



ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం



కొలువైన సీతారామలక్ష్మణుల విగ్రహాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని జంగంరెడ్డిపల్లి సమీపంలోని బండమీద వెలసిన సీతారాముల ఆలయం కార్తీక పౌర్ణమి ఉత్సవాలకు సిద్ధమైంది. వారు బండపై కొలువుదీరడంతో ప్రజలు బండమీది జాతరగా పిలుచుకుంటారు. ప్రతియేటా కార్తీక పౌర్ణమిరోజు నుంచి మూడు రోజుల పాటు ఈ జాతర కొనసాగుతుంది. ఉత్సవాలకు ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. జగదేవ్‌పూర్, కొండపాక, సిద్దిపేట, ములుగు, చేర్యాల, యాదాద్రి జిల్లా రాజపేట, తుర్కపల్లి మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హజరై స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయం ఎదుట భాగంలో ఉన్న గుండంలో స్నానంచేసి స్వామివారిని దర్శించుకుంటే సర్వరోగాలు నయం అవుతాయని భక్తుల నమ్మకం. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. కార్తీక పౌర్ణమికి ఒక రోజు ముందే భక్తులు ఆలయం వద్దకు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బసచేసి సూర్యోదయానికి ముందే మేల్కొని గుండంలో స్నానాలు చేసి స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

అధిక సంఖ్యలో రానున్న భక్తులు

కొండపోచమ్మ ఆలయానికి రెండు కిలో మీటర్ల దూరంలోనే సీతారాముల ఆలయం ఉండడంతో అక్కడి వచ్చే భక్తులు ఆ రోజు తప్పకుండా స్వామి అమ్మవార్లను దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని అర్చకులు బుధవారం తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు జాతర కొనసాగుతుందని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

పౌర్ణమి రోజున ప్రారంభమయ్యే బండమీద సీతారాముల ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం. మూడు రోజుల పాటు వేలాది మంది భక్తులు తరలి వస్తారు.

\- కుమార్, మాజీ సర్పంచ్

ఏసీపీ సహా మరో ముగ్గురిపై కేసు

వెంగళరావునగర్: విధులకు ఆటంకం కలిగించిన సిద్దిపేట ఏసీపీతోపాటు మరో ముగ్గురిపై హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ ఎస్ఐ జి.కాంతారావు తన సిబ్బందితో కలిసి మంగళవారం అర్ధరాత్రి మైత్రీవనం వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్ఆర్‌నగర్ వైపు వెళ్తున్న ఓ వాహనాన్ని ఆపారు. అయితే డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తి పక్కకు మారి పక్కన ఉన్న మరొక వ్యక్తి డ్రైవింగ్ సీటుకు వచ్చాడు. దీనిని గమనించిన మహిళా కానిస్టేబుల్ విషయాన్ని ఎస్ఐకు తెలియజేశారు. ఎస్ఐ వారిని దిగమని చెప్పి బ్రీత్ ఎనలైజర్ చేయాలని అడగ్గా కారులో నుంచి ఓ వ్యక్తి దిగి తాను సిద్దిపేట ఏసీపీ సుమన్‌కుమార్ అని చెప్పారు. అతడిని బ్రీతింగ్ టెస్ట్‌కు సహకరించాలని ఎస్ఐ కోరడంతో అతడు నిరాకరించారు. ఎస్ఐని నెట్టివేసి కారులో ఉన్న మరో ఇద్దరు హడావుడి చేశారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ ఎస్ఐ కంట్రోల్‌రూమ్‌కు తెలియజేయగా మధురానగర్ పీఎస్ నుంచి సిబ్బంది వచ్చారు. ఏసీపీతో పాటు డ్రైవింగ్ సీటులో ఉన్న ఎస్.జయపాల్‌రెడ్డి, కారులో ఉన్న ఎస్.శ్రీనివాస్, జి.వెంకట్‌రావుపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోళ్లు లేక వెలవెల



కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో పక్షం రోజుల క్రితం ఐకేపీ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రం వెలవెలబోతోంది. తమకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని రైతులు సంతోషించారు. రైతులు తమ ధాన్యాన్ని కేంద్రానికి తరలించారు. అయితే కొనుగోళ్లకు కొర్రీలు పెట్టడంతో దిక్కుతోచని రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్క గింజను కూడా కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ధాన్యం కుప్పలు లేక వెలవెలబోతుంది.

'అధిక సాంద్రత'తో అధిక దిగుబడి

శాస్త్రవేత్త రవికుమార్



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొండపాక(గజ్వేల్): అధిక సాంద్రత పత్తిసాగు ఎంతో లాభదాయకమని మెదక్ జిల్లా తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్‌కుమార్ సూచించారు. కుకునూరుపల్లిలో పలువురు రైతులు సాగుచేసిన పత్తి పంటను బుధవారం వారు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు వల్ల మొక్కలు ఏపుగా పెరుగుతాయని, రెండు నెలల ముందుగానే పంట చేతికందుతుందన్నారు. చమత్కార్ మందును రెండు మార్లు స్ప్రే చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఎర్ర, మధ్యస్థ నేలల్లో సాగు చేస్తే యాసంగిలో సైతం రెండో పంటను సాగు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గోవిందరాజు, శాస్త్రవేత్త ప్రతాప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు పదివేల జరిమానా

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు న్యాయవాది ప్రియాంక పదివేలు జరిమానా విధించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. 2016లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం వన్నారం గ్రామానికి చెందిన డ్రైవర్ మద్దుల కుమారస్వామిపై అప్పటి ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువైనందున నేరస్తుడికి బుధవారం న్యాయవాది జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్ఐ తెలిపారు.

రేపు బిర్సా ముండా జయంతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్/గజ్వేల్: పట్టణంలోని 11కేవీ ఎర్రచెరువు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాసర్‌పుర, ఖాదర్‌పుర, మంగమ్మతోట, బారాహిమామ్, రాంనగర్ ప్రాంతాలలో ఉదయం 9.30గంటల నుండి మధ్యాహ్నం 12.30ని.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అలాగే అర్బన్ మండలంలోని పొన్నాల, ఎల్లుపల్లి, బట్టిరామన్నపల్లి, ఇందూరు కాలేజ్ ఏరియా, సంతోష్‌నగర్, సందీప్‌నగర్, ఇందిరమ్మ కాలనీలోను విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. అదేవిధంగా గజ్వేల్ మండలం అహ్మదిపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిడిచెడ్, కొల్గూర్, శేర్‌పల్లి, దిలాల్‌పూర్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ సత్యం తెలిపారు.

గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని చెంచేల్ చెర్వుపల్లిలో 830 గ్రాముల గంజాయిని మంగళవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రూప కథనం ప్రకారం.. గ్రామంలో గంజాయి ఉందనే సమాచారంతో జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ మూర్తి ఆదేశాల మేరకు సిబ్బంది తనిఖీలు నిర్వహించగా గణేశ్‌చారి వద్ద 830 గ్రాముల గంజాయి లభ్యమైంది. పోలీసులు స్వాధీనం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం హుస్నాబాద్ సీఐ పవన్‌కు అప్పగించారు. అతడిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా నిందితుడికి రిమాండ్ విధించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై బుధవారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ విద్యాసాగర్ తెలిపిన కథనం మేరకు.. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన మంద రాజయ్య(66) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రాజయ్యకు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. అప్పుడప్పుడు ఇంట్లో నుండి వెళ్లి మళ్లీ కొన్ని రోజులకు ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి వెళ్లిన రాజయ్య గత 9న తడ్కపల్లి గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనక నుండి ఆటో వచ్చి ఢీకొట్టింది. స్థానికులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల తర్వాత రాజయ్య కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో ఆస్పత్రికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న కొడుకు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో..

దౌల్తాబాద్(దుబ్బాక): అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇందూప్రియాల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతరాజు రామస్వామి(40) తండ్రి బాలయ్య అప్పుల బాధతో మంగళవారం పురుగుల మందు తాగాడు. అతడిని కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

సిద్దిపేటరూరల్: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో జక్కాపూర్‌కు చెందిన కోంపల్లి సాగర్(22) మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రావురూకుల శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జక్కాపూర్ గ్రామానికి చెందిన సాగర్ రాత్రి సమయంలో సిద్దిపేట నుండి దుబ్బాక వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో దుబ్బాక మండలం హసన్‌మీరాపూర్‌కు చెందిన మిట్టపల్లి శ్రావణ్, దుబ్బాకకు చెందిన శ్రీకాంత్ సిద్దిపేట వైపు వారి ద్విచక్రవాహనాలపై వస్తున్నారు. ఈ క్రమంలో రావురూకుల గ్రామం శివారులోకి రాగానే మలుపు వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న శ్రీరామ్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మండలంలో కొనసాగుతున్న సర్వేపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీరాంరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. తప్పనిసరిగా ఐడీ కార్డు ధరించాలని, మీడియాతో మాటాడొద్దని, ప్రముఖ రాజకీయ నాయకుల కుటుంబాలను కూడా సర్వే చేయాలని చెప్పారు. కుటుంబాల యజమానులకు ముందుగా సమాచారమివ్వాలని, కులానికి సంబంధించిన వివరాలను నింపాలని చెప్పారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి నాగరాజు, తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, ఎంపీడీఓ మహబూబ్ అలీ, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, ఎంఈఓ కిష్టయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

సర్వేతో ఉపాధ్యాయులపై అధిక ఒత్తిడి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: కులగణన సర్వేలో ఎన్యుమరేటర్‌లుగా విధులు నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని కోరుతూ బుధవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయేందర్ రెడ్డి, నరేందర్ మాట్లాడుతూ ప్రతి ఎన్యుమరేటర్‌కు 75 కుటుంబాలు కేటాయించి, ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. సర్వేను ఉదయం సమయంలో నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాములు, రాష్ట్ర కౌన్సిలర్లు రాజులు, జానకి రాములు, రాజయ్య, జిల్లా కార్యదర్శులు రాంరెడ్డి, మంజుల, సత్యకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

చేర్యాల(సిద్దిపేట): అమరవీరుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేద్దామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమంలో భాగంగా అమరత్వం పొందిన విద్యార్థి అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గౌతమి జూనియర్ కళాశాలలో సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ, పీడనలేని సమ సమాజం కోసం తపించిన జార్జిరెడ్డి మొదలు జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, రంగవల్లి, స్నేహలత, మారోజు వీరన్న లాంటి అనేకమంది విప్లవ వీరులు తమ ప్రాణాలు అర్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులను చదువులకు దూరంచేసే విధానాలను అవలంభిస్తుందని అందులో భాగంగానే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని ఆరోపించారు. పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరుల వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ఈ నెల 16న దుబ్బాక డివిజన్ కేంద్రంలో ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, అనిల్, అంజి, రమేష్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల కేంద్రం నుంచి బెక్కటి గుట్ట మీదుగా కూటిగల్ గ్రామానికి రోడ్డు నిర్మించాలని సీపీయం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ డిమండ్ చేశారు. బుధవారం దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో ఆ పార్టీ 5వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి నేరుగా రహదారి లేకపోవడంతో తోర్నాల, బెక్కల్ గ్రామాలు తిరిగి రావడం వల్ల 15కిలో మిటర్లు తిరిగి రావసివస్తుందని వాపోయారు. బెక్కల్ గుట్ట మీదుగా రహదారి నిర్మాణం చేపట్టాలని, ధ్వంసమైన రోడ్డు స్థానంలో డబుల్ రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, శ్రీరాములు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సర్వే పరీక్షకు సిద్ధం చేయండి: ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లి, హనుమాన్ నగర్, కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. నమూనా ప్రశ్నపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ మూడేళ్లకోసారి ఎన్‌సీఈఆర్టీ నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు ప్రతీరోజు ఆయా అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సీసీ కెమెరాలతో దొంగతనాలను అరికట్టవచ్చు

కొండపాక(గజ్వేల్): దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండపాక గ్రామంలో బుధవారం 13 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పవర్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే దొంగతనాలు, గొడవలు జరిగితే సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా శిక్షపడేలా చేయవచ్చన్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీనివాస్, వీపీఓ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఆత్మరక్షణకు కరాటే దోహదం

దుబ్బాకటౌన్: మహిళలపై జరుగుతున్న నేరాలను అధిగమించడానికి కరాటే శిక్షణ అవసరమని సీఐ శ్రీనివాస్ అన్నారు. జాతీయస్థాయి మూడో కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గాయత్రి వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థులు నిషల్, మనస్విన్ బంగారు పతకాలు సాధించారు. సీఐ కార్యాలయంలో బుధవారం వారిని సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): దళితుల భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి ఇబ్బంది పెడుతున్న తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అంకార్ మధు డిమాండ్ చేశారు. మండలంలోని అల్లిపూర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ 1994లో కొంత భూమిని దళితులకు కేటాయించారని, దానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని కాలనీవాసులకు అందజేశారన్నారు. దళితులు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోలేదని, పట్టాచేయాలని కోరితే తహసీల్దార్ పట్టించకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బాలయ్య, రాయమల్లు, మహేశ్, ఎల్లయ్య, అజయ్, కామనీలయ్య పాల్గొన్నారు.

◆ కానిస్టేబుల్ మృతికి హరీశ్‌రావు సంతాపం

చిన్నకోడూరు(సిద్దిపేట): మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ మృతిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, సిద్దిపేట సీపీ అనురాధ బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. పట్టుదలతో బాధ్యతలు నిర్వహిస్తున్న నవీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. నవీన్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

◆ ఆత్మహత్యలకు బాధ్యత ప్రభుత్వానిదే..

సిద్దిపేటజోన్/హుస్నాబాద్: బాసర ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదిత్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వివేకానంద చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. బాసర ట్రిపుల్ ఐటీ పియూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియ హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకుందని, పరామర్శించేందుకు వెళ్లిన ఏబీవీపీ నాయకులను అడ్డుకోవడం, దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, సంతోష్, ధనుష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

◆ అధికారులపై దాడి సరికాదు

కొమురవెల్లి(సిద్దిపేట): వికారాబాద్ కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై దాడి సరికాదని రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ కో-చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఖండించారు. కొమరవెల్లిలో ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌తో కలిసి బుధవారం ఆయన మాట్లాడారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిని జేఏసీ ఆధ్వర్యంలో ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్ నర్సింహులు గౌడ్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.